sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 26-01-2026 సోమవారం | సంపుటి-1 సంచిక : 308

EDITOR: ROHINI

అధికారం నాదే... సీఎం నేనే

రాబోయే ఎన్నికల్లో గెలుస్తా

- అందుకోసం తెలంగాణ జాగృతి పార్టీ
- కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రకంపనలు
- హరీష్ గుంట నక్కని... అన్న 'గుడ్డి' అని ఫైర్
- మేఘా సంస్థకు కొమ్ము కాస్తున్నారని ఎటాక్

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత సెగలు పుట్టిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అగ్ర నేతలు హరీష్ రావు, కేటీఆర్?లపై ఆమె యుద్ధం ప్రకటించారు. నైనీ కోల్ బ్లాక్ వ్యవహారంలో కీలక ఆరోపణలు చేస్తూ గులాబీ గూటిలో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. ఇటు ఫోన్ ట్యాపింగ్, అటు పార్టీ భవిష్యత్తుపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ అధికారంలోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. తద్వారా నెక్స్ట్ సీఎం తానేనన్న సిగ్నల్ ఇచ్చారు.

- సహనం వందే, హైదరాబాద్

నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారం ఇప్పుడు బీఆర్ఎస్‌లో చిచ్చు పెట్టింది. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి హరీష్ రావు తీరును కవిత తీవ్రంగా తప్పుబట్టారు. భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టగానే హరీష్ రావు గుంటనక్కలా రంగంలోకి దిగారని విమర్శించారు. ఆయన మాటలను నమ్మి కేటీఆర్ కూడా గుడ్డిగా ప్రెస్ మీట్ పెట్టారని ఎద్దేవా చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆమె ఆదివారం విలేకరు సమావేశంలో ఘాటుగా స్పందించారు.

పెద్ద తిమింగలం కోసమే తాపత్రయం

నైనీ టెండర్ల వెనుక పెద్ద కథే ఉందని కవిత ఆరోపించారు. కేవలం మేఘా కృష్ణారెడ్డి ప్రయోజనాలను కాపాడటమే హరీష్ రావు లక్ష్యమని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కేవలం ఒక చిన్న చేప మాత్రమే నని చెప్పారు. అసలైన పెద్ద తిమింగలం మేఘా సంస్థను కాపాడేందుకు హరీష్ రావు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

జాగృతి పార్టీ సిద్ధం

రాజకీయ భవిష్యత్తుపై కవిత క్లారిటీ ఇచ్చారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపారేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. త్వరలో తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చబోతున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో తన పార్టీయే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విభజన దిశగా గులాబీ గూడు

హరీష్ రావు జిత్తులమారి రాజకీయాల వల్లే పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీని పణంగా పెడుతున్నారని దుయ్యబట్టారు. నాయకత్వంలోని లోపాలను ఎండగడుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో చీలికను సూచిస్తున్నాయి. తెలంగాణ జాగృతి వేదికగా మహిళా హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

నింగికి నిచ్చెన వేసిన వీరులు

గగనవీరులకు దేశపు గౌరవం

- శుభాన్షుకు అశోక చక్ర.. ప్రశాంత్‌కు కీర్తి చక్ర
- అంతరిక్ష యోధులకు సమున్నత గౌరవం
- సరికొత్త చరిత్రకు భారత ప్రభుత్వం శ్రీకారం

భారత గడ్డపై పుట్టిన బిడ్డలు గగన వీధులు దాటి అంతరిక్షంలో త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేశారు. భూమిపై శత్రువుల గుండెల్లో నిదురపోయే వీరులకు ఇచ్చే అత్యున్నత పురస్కారాలు ఈసారి నింగిని జయించిన వ్యోమగాములకు దక్కాయి. దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకల ఉత్సాహం ఉరకలెత్తుతున్న వేళ... సరిహద్దులు దాటి అనంత విశ్వంలో భారత్ సత్తా చాటిన యోధులను కేంద్ర ప్రభుత్వం సమున్నత గౌరవంతో సత్కరించింది.

- సహనం వందే, న్యూఢిల్లీ

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను అత్యున్నత శాంతికాల శౌర్య పురస్కారం అశోక చక్ర వరించింది. 2025 జూన్ నెలలో జరిగిన యాక్సియమ్-4 మిషన్ ద్వారా ఆయన అంతరిక్షంలో 18 రోజులు గడిపారు. రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించారు. 2,000 గంటల కంటే ఎక్కువ ఫైటర్ జెట్లను నడిపిన అనుభవం ఉన్న ఈ లక్నో వాసి... ఇప్పుడు కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారు.

ప్రశాంత్ నాయర్‌కు కీర్తి చక్ర

భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గగన్‌యాన్ మిషన్ లో కీలక పాత్ర పోషిస్తున్న గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కు రెండో అత్యున్నత పురస్కారం కీర్తి చక్ర లభించింది. శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్రలో బ్యాకప్ పైలట్ గా ఉంటూనే గగన్‌యాన్ కోసం కఠినమైన శిక్షణ పొందుతున్నారు. కేరళకు చెందిన ప్రశాంత్ నాయర్ తన అకుంఠిత దీక్షతో గగనగామిగా ఎంపికయ్యారు. దేశ రక్షణలో, అంతరిక్ష పరిశోధనల్లో ఆయన కనబరుస్తున్న అంకితభావానికి ప్రభుత్వం ఈ గుర్తింపునిచ్చింది.

అంతరిక్షంలో 60 ప్రయోగాలు...

శుభాన్షు శుక్లా అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో కేవలం పర్యటనకే పరిమితం కాలేదు. సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలో మానవ శరీరంలో వచ్చే మార్పులు, అంతరిక్ష వ్యవసాయం వంటి అంశాలపై 60 కంటే ఎక్కువ సంక్లిష్టమైన ప్రయోగాలు చేశారు. దాదాపు 41 ఏళ్ల తర్వాత ఒక భారతీయ పౌరుడు అంతరిక్షంలోకి వెళ్లి త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం దేశానికే గర్వకారణం. ఇస్రో, నాసా సంయుక్తంగా నిర్వహించిన ఈ మిషన్‌లో శుభాన్షు తన ప్రతిభను ప్రపంచానికి చాటారు.

కోర్టులో హార్ట్ బ్రేక్

రక్తం అందక తల్లడిల్లినట్టు గుండె కన్నీరు

("కోర్టు గది కాదు ఇది..."
"నీ శరీరం లోపల నడుస్తున్న కేసు!"

"గుండె అరుస్తోంది..."
"రక్తం రావట్లేదని!"

"లివర్ చెప్తోంది..."
"పదేళ్లుగా హెచ్చరిస్తున్నానని!"

"ఊపిరితిత్తులు గగ్గోలు..."
"పొగతో నింపేశావని!"

"మెదడు మండిపోతుంది..."
"విశ్రాంతి ఇవ్వలేదని!"

"నువ్వు మాత్రం..."
'అన్నీ లైట్ తీసుకున్నావు!'

"శరీరం మాట వినకపోతే..."
"అది సమ్మె చేస్తుంది!"

"ఇది కథ కాదు..."
"మనందరి జీవితం!"

"బాడీ సిగ్నల్స్ ఇగ్నోర్ చేయకు..."
"లేట్ అయితే... 'తుది తీర్పే'!"
"దేహమే న్యాయమూర్తి!")

కోర్టు గదిలో న్యాయమూర్తి నల్ల కోటు తీసి తెల్ల కోటు వేశారు. బోనులో 60 ఏళ్ళ రామయ్య నిలబడ్డాడు. తన సొంత అవయవాలే తనపై కేసు వేశాయని తెలిసి విస్తుపోయాడు. ప్రతి అవయవం తన బాధను జడ్జి ముందు ఏకరువు పెట్టాయి. మన శరీరం ఇచ్చే హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తాయో కళ్ళకు కట్టినట్లు అద్భుతమైన కథతో చెబుతున్నారు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గురజాల కిరణ్ కుమార్. ఈ కథనం చదవండి.

- మనిషి నిర్లక్ష్యంపై కేసు పెట్టిన అవయవాలు
- కోర్టులో గోడు వెళ్ళబోసుకున్న ఆర్గాన్స్
- జడ్జి తీర్పు... అందరికీ కనువిప్పు



గురజాల కిరణ్ కుమార్

కోర్టులో... నా పేరు గుండె అంటూ ఒక అవయవం తన వాదన మొదలుపెట్టింది. రక్తాన్ని సరఫరా చేసే నా నాళాల్లో కొవ్వు పేరుకుపోతుంటే రామయ్య పట్టించుకోలేదని వాపోయింది. అప్పుడప్పుడు ఆయాసం వచ్చినా... ఎడమ చేయి లాగుతున్నా అది గ్యాస్ సమస్య అని కొట్టిపారేశాడని వాపోయింది. ఛాతిలో చిన్న నొప్పి, అకస్మాత్తుగా వచ్చే చెమటలు గుండె ఇచ్చే ముందస్తు హెచ్చరికలని తెలుసుకోలేదని కోర్టుకు విన్నవించింది. రక్త సరఫరా అందక నేను ఎంత తల్లడిల్లానో ఈ రామయ్యకు అర్థం కాలేదని కన్నీరు పెట్టింది.

లివర్ లొల్లి...

కాలేయం తన గొంతు విప్పింది. శరీరంలో 120 పనులు చేసే నన్ను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. హెపటైటిస్ వైరస్ సోకినప్పుడు వందల సార్లు హెచ్చరించానని చెప్పింది. కడుపు ఉబ్బరం రావడం, గ్యాస్ రావడం, కళ్ళు పచ్చగా మారడం ఇవన్నీ నేను చేసిన సంకేతాలేనని గుర్తు చేసింది. మూత్రం పసుపు రంగులోకి మారినా, బరువు తగ్గుతున్నా రామయ్య మేలుకోలేదని జడ్జికి వివరించింది. పదేళ్లు పోరాటం చేసి అలసిపోయి ఇక పనులు ఆపేశానని తన దీనగాథను వినిపించింది.

శ్వాస తీసుకోని ఊపిరితిత్తులు

తర్వాతి వంతు ఊపిరితిత్తులది. ప్రాణాధారమైన నన్ను ధూమపానం, కాలుష్యంతో నింపేశాడని ఆరోపించాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 32 లక్షల మంది శ్వాసకోశ వ్యాధులతో చనిపోతున్నా రామయ్యకు భయం లేదని ఎద్దేవా చేశాయి. దగ్గు తగ్గకపోయినా, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్నా పట్టించుకోలేదని నిలదీశాయి. పెదాలు, నాలుక నీలి రంగులోకి మారడం అనేది తీవ్రమైన ముప్పునకు సంకేతమని గ్రహించలేదని ఆవేదన చెందాయి. గాలి అందక నేను పడుతున్న పాట్లు రామయ్యకు అర్థం కాలేదని మండిపడ్డాయి.

మండిపడ్డ మెదడు

మెదడు సైతం తనగోడు చెప్పుకుంది. తలనొప్పి వస్తున్నా, నిద్ర పట్టకపోయినా మందులతో కాలం గడిపేశాడని వాపోయింది. అన్ని అవయవాలను సమన్వయం చేసే నాకే విశ్రాంతి ఇవ్వలేదని తప్పుబట్టింది. తల తిరగడం వంటి లక్షణాలను తేలిగ్గా తీసుకోవడం వల్ల పక్షవాతం వంటి ముప్పులు పొంచి ఉంటాయని హెచ్చరించింది. ఆలోచనలు భారంగా మారినప్పుడు, జ్ఞాపకశక్తి తగ్గుతున్నప్పుడు కూడా రామయ్య నిర్లక్ష్యంగా ఉండటం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని స్పష్టం చేసింది.

జడ్జి తీర్పు...

అవయవాల ఆవేదన విన్న తర్వాత జడ్జి కీలకమైన వ్యాఖ్యలు చేశారు. శరీరంలో ప్రతి చిన్న మార్పు వెనుక ఒక అర్థం ఉంటుంది. గాయాలు త్వరగా మానకపోతే జింక్ లోపమని, కండరాలు బలహీనపడితే పొటాషియం తగ్గిందని గుర్తించాలి. విపరీతమైన అలసట వస్తుంటే మెగ్నీషియం అవసరమని తెలుసుకోవాలి. హృదయ స్పందనలో మార్పులు వస్తే మాంగనీస్ లోపం ఉన్నట్టే. ఎముకల నొప్పులు, గోర్లు మెత్తబడటం క్యాల్షియం కొరతకు నిదర్శనం. చర్మం పాలిపోయి, తలనొప్పి వస్తుంటే ఐరన్ లోపం వల్ల రక్తహీనత కలిగిందని అర్థం చేసుకోవాలని జడ్జి హితవు పలికారు.

దేహ భాష నేర్చుకోండి

జడ్జి ఇంకా కీలక వ్యాఖ్యలు చేశారు. మాతృభాష, దేశ భాషలాగే శరీరానికి ఒక భాష ఉంటుందని గుర్తు చేశారు. 40 ఏళ్ల వరకు దేహం నీ మాట వింటుందని... ఆ తర్వాత నువ్వే దేహం మాట వినాలని సూచించారు. అవయవాలు చేసే హెచ్చరికలను వినకపోతే అవి సమ్మె చేయడం ఖాయమని హెచ్చరించారు. రామయ్యను శిక్షించడం కంటే, ప్రజలంతా తమ శరీర భాషను అర్థం చేసుకుని ఆరోగ్యంగా ఉండటమే ఈ తీర్పు ఉద్దేశమని ప్రకటించారు.

- గురజాల కిరణ్ కుమార్, రిటైర్డ్ ఆర్మీ, రాజమండ్రి, 9885275898